# పేకాట చౌదరి

సాధారణమైన మనిషి చేయి ఎత్తితే అందనంత ఎత్తు... వత్తైన గిరజాల జుట్టు... బిద్దు మీసం... నూటపాతిక కేజీల బరువు... సోలెడు బియ్యపు అన్నంతిని హరాయించుకోగల శక్తి వున్న ధృఢకాయం! ఎవరి దృష్టినైనా ఇట్టే ఆకర్షించగల మనిషి చౌదరి!. ఒకసారి చూస్తే మళ్లా మళ్లీ చూడాలనిపిస్తుంది. ఎం.ఎల్.ఏ. పంచ... పొందూరు సిల్కు జుబ్బా... మీద కండువాతో చూడముచ్చటగా వుంటాడు చౌదరి! మనిషిలో దర్జా దర్పం వుట్టిపడుతూంటుంది.

పిల్లల్లేరనే దిగొక్కటేగాని చౌదరికి ఏలోటూలేదు. వందెకరాల భూస్వామి!

చౌదరికి వున్న బలహీనతల్లా... భారతంలో ధర్మజుడికి మల్లే జూదపరుడు. పేకాటంటే మహాప్రీతి! ఇది తప్పిఇంచి మిగతావన్నీ మంచి లక్షణాలే!.

సిగరెట్ వాసన పడదు. మందు ముట్టడు. ఆడదానికి ఆమడ దూరంలో వుంటాడు. ఏకపత్నీవ్రతుడన్నమాటే గాని... పట్టుమని పదేళ్లయినా కాపురం చేయకుండానే భార్య శ్రీ మహాలక్ష్మి పక్షవాతం బారన పడింది. నరు చేయి పడిపోవటంతో అన్నీ మంచంలోనే!

సంసారానికి శ్రీమతి పనికిరాలేదన్న బదధలేదు చౌదరిలో! ఉదయాన్నే తనే భార్యకి పళ్లు బ్రష్ చేస్తాడు. వళ్లు రుద్ది స్నానం చేయిస్తాడు. టిఫిన్ భోజనం ఆమె నోటికి స్వయంగ అందించి తినిపిస్తూ తృప్తిపడతాడు.

చౌదరిలాంటి దేవుడు తనకు భర్తగా దొరికినందుకు కృతజ్ఞతగా ఆమె కంటి కొలుకుల్లో నీరు నిల్చినపుడు... బార్య తలనిమిరి... వీపు తట్టి... పైట కొంగుతో కన్నీరు తుడుచి ధైర్య నూరిపోస్తాడు.

చౌదరి అసాధారణ వ్యక్తిత్వం గల మనిషి.

వందెకరాల భూమి... కమతగా... పాలేర్లు... ఇంటిముందు రెండు కార్లు... కొట్టంలో అదడజను ఎడ్లు... రెండు ట్రాక్టర్లు... నాలుగు పాడిగేదెలు... రెండు ఆవులు... పెద్దలోగిలి ఇల్లు... ఇంట్లో లంకంత ఇనప్పెట్టె!... అందులో నోట్లకట్టలు... నగానట్రా.. వెండి కంచాలు ఇతరమైన విలువగల సామాను! ఇదీ చౌదరి స్థాయి.

చౌదరికి చదువు అబ్బలేదు. నిశానీ అతని అథారిటీ! అతనికో బావమరిది వున్నాడు. బి.ఏ. మూడు సార్లు తప్పాడు. పేరు భజగోవిందం! చౌదరికి అంతరంగిక కార్యదర్శి!.

విలేజి నుంచి టౌన్లోకి బావమరిదిని వెంటేసుకుని కార్లో 'క్లబ్8 కొస్తాడు. తెల్లార్లూ 'రమ్మీ' పెద్ద స్టేకుతో ఆడతాడు. అతని టేబులు ముందు ఎవరు కూర్చుని ఆడాలన్నా భయపడతారు. అయినా సరే తెగించి రెగ్యులర్‌గా ఆడేవాళ్లు ఓ అరడజను మందివుంటారు.

రాత్రి పేకాటలో వచ్చిన డబ్బుని కట్టలుగా కట్టి బ్రీఫ్‌కేసులో సర్ది తెలతెలవారుతూండగా విలేజ్‌కి వెళ్లిపోతాడు చౌదరి.

ఆడిన రోజుల్లా లక్షకి తక్కువ లేకుండా చౌదరి తన్నుకుపోవటం చూస్తూ మిగతావారు కళ్ల నీళ్ళు పెట్టుకోని రోజంటూ వుండదు.

ఏడుపు ఏడుపే... ఆట ఆటే! అదే పేకాటలో వున్న మహత్తు! కొకైన్లాంటి మత్తునిస్తుంది ఆట! ఫుల్ బాటిల్ తాగినంత కిక్ ఇస్తుంది! అంచేతే అలవాటుపడిన వాళ్లు దీన్ని ఓ పట్టాన విడిచిపెట్టి పోలేరు.

ఆటలో మత్తుతో పాటు మహత్తూ వుంది. అదృష్టవంతుడివి లక్ష్మీదేవి వరిస్తుంది. లక్ లేని వాడిని చేతిలో ముక్కలే తాచుపాములై కరుస్తయ్!-

క్లబ్ అనే పేరేగానీ.... అక్క అన్నీ దొరుకుతయ్. సప్లై కానిదంటూ వుండదు. అక్కడికొచ్చేవారంతా ముడైదు సిగరెట్లు కాల్చేవారే. ఆటగాళ్ల కోసం ఒక్క రిత్రికి 10 కేసుల విస్కీ ఖర్చవుతుంది. బిర్యానీ చికిన్ ఫ్రై లాంటి వాటికి కొదువుండదు. వీటన్నిటినీ మించి అందమైన భామలు ప్లేయర్స్ చుట్టూ గ్ల పీలికలతో తిరుగుతూ మందు నోటికందిస్తూంటారు. ఆటగాళ్లు ఐసైపోయి విసిరేసే పచ్చనోట్లు అభాగినులు అందుకుని తృప్తి పడుతూంటారు. ఇది! రోజువారి టైమ్‌టేబుల్!.

చౌదరి వీటన్నిటికీ దూరం!. ఆకలన్పించినపుడు బావమరిది వెంట తెచ్చిన హాట్‌పాక్ ఓపెన్‌చేసి ఇంటి తిండి ప్లేట్లో పెట్టి బావగారికి తినిపిస్తాడు.

క్లబ్లో కనీసం మంచి నీళ్లు కూడా ముట్టడు. వెంట కార్లో తుచ్చుకున్న వాటర్ బాటిల్సే వాడతాడు.

అందరికీ అందమైన అర్థాంగులు ఇళ్లల్లో వున్నా క్లబ్‌లో వారికోసం వెంపర్లాడతారు.

భార్య నయంకాని రోగంతో మంచాన పడివుండటం చూడలేని బంధువులు... శ్రేయోభిలాషులు... హితులు.. మరోపెళ్లి చేసుకు సుఖపడమని సలహా ఇస్తే చౌదరి తోకతొక్కిన తాచే అవుతాడు. అతని కల్లల్లో కన్పించే ఎర్రజీరలు చూచి ఎదుట వున్న వాళ్లు మరో మాట మాట్లాడే సాహసం చేయరు!.

టౌను క్లబ్ జోలికి వెళ్లాలంటేనే ఖాఖీలకి భయం. ట్రాన్స్ఫర్ మీద వచ్చి ఏ ఎస్సై.. సర్కిల్ గానే రైడింగ్ పేరుతో దాడి చేసారంటే చాలు... మరుసటిరోజు కల్లా బదిలీ ఆర్డరు వాళ్ల చేతికొస్తుంది.

క్లబ్‌లో టర్నోవర్ అక్షల్లో వుంటుందని... సరసశృంగార కేళీ వినోదాలకు నిలయమనేది ఓపెన్ సీక్రెట్టే!.

ఆ క్లబ్ కమిటీ ప్రసిడెంట్ రూలింగ్ పార్టీ హెూమ్‌మినిస్టర్‌కి స్వయాన తమ్ముడు!

మామూళ్ల కోసం కక్కుర్తిపడి క్లబ్‌కేసి పోలీసోళ్లు వెళ్లేపనేలేదు. నెలనెలా టార్గెట్ ప్రకారం ఎవరి మామూలు వారికి అందుతూనే వుంటయ్! దట్సాల్!!

X X X

పాలేరు కొడుకిని చదివించింది చౌదరే!! వాళ్ల ఊరికో డాక్టర్ కావాలనే దూరాలోచనతో.. తనకెట్లాగూ పిల్లల్లేరు కదాని... చదువులో చురుకుగా వున్నాడు కదాని ఆర్థికంగ సహాయం చేసాడు.

బావమరిది భజగోవిందం పరమ కంత్రీ అనే విషయం చౌదరికి తెల్సినా చూచీ చూడనట్టుంటాడు. మందుప్రియుడే కాదు... ఆడగాలి అంటే పడిచస్తాడు భజగోవిందం!- ఫుల్ బాటిలు వూదేసి నిటారుగ నడుచుకుంటూ రంగనాయకి ఇంటికెళ్లి దాని కూతుర్తో కులికి వస్తూంటాడు.

పెళ్లి చేసుకోరాదుర్రాని ఎన్ని సార్లు క్లాసు పీకినా... అవక్కటీ అడగద్దు బాని వెధవ మొహం పెడతాడు. అదేమంటే అక్క జీవితం మంచానికే అంకితమై బాధపడుతోంది అక్కమీదుంటే ప్రేమ అభిమానమే నన్నిలా తయారుచేసిందంటూ కంటడతి పెడతాడు. కాళ్లమీద పడతాడు!

చెడు తిరుగుళ్లతో 'ఎయిడ్స్' లాంటి మహమ్మారి నిన్ను పొట్టన పెట్టుకుంటుందేమోరా అంటే... ఈరోజు చస్తే... రేపటికి రెండు అంటాడు మొండిగ!

బావమరిది ఎంత ఖర్చుపెట్టినా... దేనికోసం ఖర్చుపెట్టినా వివరం అడిగే అలవాటు చౌదరికి లేదు. పెళ్లాం అదృష్టం మూలానే తనకింత సిరి అబ్బిందనుకుని గర్వపడుతూంటాడు.

తానెట్లాగూ సుఖానికి నోచుకోలేదు. భజగోవిందాన్నయినా బాగుపడనీ అనుకుంటాడు చౌదరి.

అవసరం పీకలమీదికొచ్చిందని వీధి గుమ్మంలో నిలబడి చేతులు చాచి నోరు తెరిచి యాచిస్తే వాళ్లని ఆదుకుంటాడు. వారి అవసరాలు గుర్తించి తగినంత సహాయం చేస్తాడు.

అందుకే చౌదరిని ఆ వూళ్లో అందరూ దేవుడిలా కొలుస్తారు. చౌదరి మాట వేదవాక్కు.

చౌదరి ఎదురుగ నడవాలంటేనే వూరి వాళ్లు జంకుతారు.

X X X

పొలం పన్లున్నప్పుడు... పండుగరోజుల్లో... ప్రతి శని, ఆదివారం... పేకాటకు చౌదరి దూరం! అది అతను గీసుకున్న లక్ష్మణరేఖ!. గీత దాటడు.. ఆడిన మాట తప్పడు! అదీ చౌదరి నైజం.

జోకర్ కట్‌చేస్తూ 'చౌదరీ! పేకాటలో సంపాదిస్తున్న డబ్బంతా ఏం చేస్తావయ్యా? ఎప్పుడూ నీదే పైచేయి ఆయె! హెూల్‌సేల్ వ్యాపారం చేసే ముకుందయ్య అడిగాడు.

'ఈ ఏడాది పొలంలో నాట్లకి బదులు నోట్లు నాటదామనుకుంటున్నాను...' జోక్ కట్ చేసాడు చౌదరి.

ముకుందయ్య మొహం మాడిపోయింది! కిక్కురుమన్లేదు.

'వారెనీ.. మొత్తానికి అసాధ్యుడువే!... అదికాదు చౌదరీ.. నీ వెనక తినేవాళ్లెవరూ లేరుగదాని...' తెప్పరుల్లుకుని ముక్కలు సర్దుకుంటూ విన్పడీ వినపడనట్టు మాట్లాడాడు ముకుందయ్య.

'లేకపోతే ఏందయ్యా నీమాటలు?. డబ్బేమైనా చేదా?... రోడ్డు మీద పారేస్తామా?...'

సీరియస్‌గా ముక్కల మీద దృష్టి నిలిపి పరిహాసంగ మాట్లాడేడు చౌదరి.

'అని కాదనుకో.. పుణ్యకార్యాలేవైనా చేసినా నీక్కొంత తృప్తిగా వుంటుంది కదాని!...' ముక్కేస్తూ నవ్వాడు ముకుందయ్య.

'నువ్వేసిన ఆటీన్ రాణీతో షో! పన్నెండు ముక్కలు పండిపడ్డయ్...' చేతిలో ముక్కలు టేబులుపై పరిచాడు చౌదరి.

'నువ్వు ఆటకొట్టనిదెప్పుడ్లే? - పదేళ్లలో నేనేమో పదెకరాలు తెగనమ్మాను. నువ్వేమో పాతిక ఎకరాలు కొనేసిన మొనగాడివైతివి...' కౌంటిస్తూ వెర్రి మొహం పెట్టేడు వడ్డీ వ్యాపారం చేసే సేట్ భానోజీ.

మిగతా వారి మొహాలు అట్ల పెంకు మాదిరి నల్లగ మాడిపోయినయ్.

'మా విలేజ్‌లో వృద్ధాశ్రమం కట్టబోతున్నాను...' మనసులో మాట వ్యక్తపరిచాడు చౌదరి.

'ఏంటీ? నీ సొంత ఖర్చుతోనేనా?' ముక్తకంఠంతో అని అంతా ఆశ్చర్యాన్ని ప్రకటించారు.

'అవును! నా స్వంత ఖర్చుతోనే! మీకేమైనా బాధగా వుందా?-' వెటకారం ధ్వనించింది చౌదరి మాటల్లో.

'అబ్బో... అబ్బో! నీది భలే ఆలోచన చౌదరీ! మన దేశంలో దిక్కు మొక్కు లేని వృద్ధులు లక్షలమంది వున్నారంట!. మొన్నామధ్య ఎప్పుడో టి.వీ లో చెప్తే ... విన్నాన్లే! నీ సాయం కొందరికైనా అక్కరకొస్తే ఎంతో పుణ్యం!. అన్నదానం కంటే గొప్పదీ...' రిటైర్డ్ తహసీల్దార్ రావ్ మాట్లాడాడు.

'సకల సదుపాయాలతో ఓ వంద పడకల వృద్ధాశ్రమం కట్టిస్తా రావుగారూ! ఇది నా జీవితాశయం! చానాళ్ల బట్టి ప్లాన్లో వుండా... మొన్నీ మధ్యనే సిద్ధాంతిగారు ముహూర్తం నిర్ణయించారు. పన్లు ప్రారంభించడమే ఆలశ్యం.... మీరంతా ప్రారంభోత్సవానకి తప్పకుండా రావాల...' విషయం చెప్పి ఆహ్వానం పలికాడు చౌదరి.

మమ్మల్ని కూడా విరాళాలివ్వమంటావా?-' ముక్కల్లో తలదూర్చి తలపక్కకు తిప్పకుండా తదేకంగ వాటికేసి చూస్తూ అన్నాడు శ్రీహరి! ఈయన గారికి రైస్‌మిల్లు అయిలు మిల్లులూ వున్నయ్.

'ఇదిగో శ్రీహరీ! నువ్వు చేస్తోంది నూనె వ్యాపారం అంటే... నీదంతా జిడ్డు వ్యవహారం లేద్దూ!... నీతో పెట్టుకుంటే పన్లెక్కడౌతయ్! - ఈ విషయంలో ఎవరి సహాయమూ

అక్కర్లేదు...' నెత్తిన మొట్టినట్టు అన్నాడు చౌదరి.

పొంతనలేని ముక్కలు పడటంతో ఆట డ్రాప్‌చేసి పక్కనున్న బాపినీడు చేతిలో ముక్కల కేసి దృష్టి సారించాడు శ్రీహరి.

పేకాట పారాయణ ఛలోక్తులతో... ఎత్తిపొడుపు మాటలతో వ్యంగ్యోక్తులతో రంజుగా సాగుతోంది.

X X X

కోటిరూపాయల ఖర్చుతో సకల సదుపాయాలతో వంద పడకల వృద్ధాశ్రమం ఏడాది తిరక్కుండానే పూర్తి అయింది.

మంచాలు... బెడ్లు... కప్‌బోర్డు ఇంకా ఇతరమైన ఫర్నిచరొచ్చేసింది. వృద్ధాశ్రమం ప్రారంభం

కానున్నదనే విషయం న్యూస్ పేపర్ల ద్వారా... టీ.వీ. ద్వారా ప్రచారమవటంతో రాష్ట్రం నలుమూలల నుండి అనేకమంది వృద్ధులు నిరాశ్రయులు చౌదరి వృద్ధాశ్రమానికి వుత్తరాలు వ్రాసేరు.

వారి దరఖాస్తులను స్క్రీనింగ్ కమిటి ఫైనల్ చేసి ఒక వందమంది వృద్ధుల లిస్ట్ తయారు చేయటం జరిగింది. నిరుపేదలకు కన్నబిడ్డల ఆదరాభిమానాలకు నోచుకోనివారికి మాత్రమే ఆశ్రయం లభించిది!.

పాలేరు కొడుకు సిటీలో డాక్టర్‌గా వుంటున్న వాడిని వెనక్కు పిలిపించిన చౌదరి ఆశ్రమంలో వృద్ధులకు మెడికల్ ఎయిడ్ అందించాలని కోరాడు. అందుకు తలవూపి తన సంసిద్ధతను వ్యక్తపరిచాడు డా॥కరుణ్.

డిస్పెన్సరీతోపాటు ఒక మెడికల& షాపును కూడా ఏర్పాటు చేసాడు చౌదరి!

'ఓల్డేజ్ హెూమ్' రాష్ట్ర ముఖ్యమంత్రిగారి చేతులమీదుగా ప్రారంబోత్సవ వేడుక కన్నుల పండుగ్గా జరిపించాడు చౌదరి.

చౌదరి దాతృత్వాన్ని ముఖ్యమంత్రి వేనోళ్ల కొనియాడారు. సంపన్నులంతా ఇటువంటి సేవాకార్యక్రమాల్లో పాల్గొనాల్సి అవసరాన్ని గురించి ప్రసంగించారు. ప్రభుత్వం వేపు నుండి కూడా తగిన విధంగ సహాయ సహకారాలు అందించటం జరుగుతుందని వాగ్దానం చేసారు.

ఆనాటి కార్యక్రమమం దిగ్విజయంగ... నేత్రపర్వంగ ముగిసింది! వృద్ధాశ్రమానికి

చౌదరి భార్య పేరు పెట్టటం మరో విశేషం!

వృద్ధాశ్రమ కార్యనిర్వహణాధికారగా బావమరిది భజగోవిందాన్ని నియమించి అతనికి అన్ని బాధ్యతలు అప్పగించాడు చౌదరి.

సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్న భజగోవిందం మందు... మగువ జోలికి పోనంటూ శాశ్వతంగ 'గుడ్ బై' చెప్పాడు. ఆ నిర్ణయం చౌదరికెంతగానో నచ్చి బావమరిదిని ఆశీర్వదించాడు.

X X X

టౌన్ క్లబ్‌లో సభ్యులందరూ చౌదరి కోసం ఎదురుచూస్తున్నారు. అతనొస్తేగానీ పేకాట మొదలవదు.

క్లబ్ ఫ్యూన్ పరదేశి పరుగెత్తుకుంటూ వచ్చినవాడల్లా... అక్కడున్నవారి ముఖాల్లోకి విచారంగ చూస్తూ' చౌదరిగారికి రాత్రి గుండెనొప్పి వస్తేనూ... ఆయనగోరి బామర్ది భజగోవిందంగోరు... కార్లో బావగారిని సిటీకి తీసుకెళ్లాడంట...' రొప్పుతూ ఆయాసపడుతూ ఆగి ఆగి చెప్పాడు.

పరదేశి మాటలు విని అక్కడున్న వారంతా నిర్ఘాంతపోయారు.

'నిన్నటివరకు పిడిరాయిలాగ వున్న మనిషికి హార్ట్ ఎటాక్ ఏమిటండీ?- విస్తుపోయిన రిటైర్డ్ తహసీల్దార్ రావ్ అన్నాడు.

'ఏనుగులాంటి మనిషి! ఒక్క చెడ్డ అలవాటైనా లేదు. మంచి తిండి పుష్టి కలవాడు కూడాను. అలాంటి చౌదరికి గుండె నొప్పేమిటండీ? నమ్మశక్యం కావటంలేదు...' ముకుందయ్య అన్నాడు.

'గుండె జబ్బు అంటే... అంతేనండీ!. ముందుగా చెప్పిరాదు. అకస్మాత్తుగా వచ్చి మీద విరుచుకుపడుతుంది. అంతే!-' తనకు తెలిసింది చెప్పాడు శ్రీహరి.

'దేవుడులాంటావాడు. చౌదరికేమీ వాదులెండి...' ధైర్య తెచ్చుకుని మాట్లాడాడు మరో సభ్యుడు.

'ఈరోజుకి పేకాట కేన్సిల&!. చౌదరి కోలుకుని వచ్చేవరకు మనమెవ్వరం పేకాటజోలికే పోవద్దు...' అనేసి సమిష్ఠిగ ప్రతిన పూనారు సభ్యులంతా ఏకమై.

X X X

చౌదరి అంత్యక్రియలు అత్యంత ఘనంగ జరిగినయ్! గంధపు చెక్కలు తెప్పించి మరీ కార్యక్రమం నిర్వహించారు.

ఆయన ఆకస్మిక మరణానికి కంటతడిపెట్టని వారంటూలేరు.

నోరు పడిపోయి పక్షవాతంతో మంచంలో వేన్న భార్య విలవిల్లాడిపోయింది. కన్నీఉ మున్నీరుగ విలపించింది. భర్త తనను ఏకాకిని చేసి పోయినందుకు! అక్కని ఓదార్చటం భజగోవిందం వల్లకాలేదు.

బావ తనను శాశ్వతంగ విచిపెట్టి పోయినందుకు జవసత్వాలు లేనట్టన్పించింది!

నెలాళ్లు తిరక్కముందే చౌదరి శిలా విగ్రహాన్ని ఆశ్రమం ప్రాగంణంలో ప్రతిష్టించాడు భజగోవిందం!

ఎక్కడివారందరూ వచ్చి చౌదరి శిలావిగ్రహాన్ని పూలమాలలతో ముంచెత్తారు. చౌదరి ఆత్మశాంతికి శ్రద్ధాంజలి ఘటించారు.

ఇటు వూరి ప్రజల గుండెల్లో... అటు ఆశ్రమవాసుల హృదయాల్లో చిరస్మరణీయంగ నిల్చిపోయాడు చౌదరి!.

---సమాప్తం---